సాక్షి
పెద్దపల్లి



కొలువుదీరిన దుర్గామాత

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలోనూ దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమవారం । 16 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

మల్లన్నకు పట్నాలు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. పలు ప్రాంతాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సన్నిధిలోని కోనేటిలో స్నానాలు ఆచరించి కోడెమొక్కు చెల్లించారు. పట్నాలు వేసి, బోనాలతో నైవేద్యం సమర్పించారు. మల్లికార్జునస్వామి, సీతరామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. స్వామివారి పేరిట హుండీలో కానుకలు వేశారు. తలనీలాలు సమర్పించారు. ఆలయ ఈవో సదయ్య భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీఆర్‌ఎస్ సంబురాలు



టపాసులు పేల్చుతున్న నాయకులు

గోదావరిఖని: బీఆర్‌ఎస్ మేనిఫెస్టోపై ఆ పార్టీ నాయకులు టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో రామగుండం కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు బాణసంచా పేల్చి సంబురాలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు పాతపల్లి ఎల్లయ్య, ఇంజపురి పులేందర్, బాల రాజ్‌కుమార్, మాదాసి రామ్మూర్తి, మండ రమేశ్, చల్లగురువుల మొగిలి, గాదం నందు, వంగ శ్రీనివాస్, మహంకాళి అంజయ్య, దాసరి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది ప్రజల మేనిఫెస్టో



కోలేటి దామోదర్

గోదావరిఖని: బీఆర్‌ఎస్‌ది ప్రజల మేనిఫెస్టో అని పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ ఆదివారం ప్రశంసించారు. సకలజన సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ఉందని పేర్కొన్నారు. ప్రజావసరాలు తీర్చేలా, రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడేలా మేనిఫెస్టోను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 93లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా రైతుబీమా తరహాలో కేసీఆర్ బీమాను అమలు చేస్తామని హామీ ఇవ్వడం చరిత్రాత్మకమన్నారు.

ముగిసిన బ్రిడ్జి పోటీలు



బహుమతులు అందుకుంటున్న విజేతలు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో శనివారం ప్రారంభమైన బ్రిడ్జి పోటీలు ఆదివారం ముగిశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్య, రిక్రియేషన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొట్టి సదానందం తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. క్లబ్ ప్రతినిధులు ధర్మయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏఈవో శ్రీనివాస్‌కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

కమాన్‌పూర్(మంథని): గుండారం క్లస్టర్ ఏఈవో యాదగిరి శ్రీనివాస్ ఆదర్శ సాగు విధానంలో ప్రతిభ చాటారు. ఈమేరకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ద్వారా శనివారం రైతునేస్తం అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా గన్నవరం మండలం ఆత్కూరులోని ముప్పవరపు ఫౌండేషన్ నిర్వహించిన రైతునేస్తం మాసపత్రిక 19వ వార్షికోత్సవం ఆత్కూరులో నిర్వహించారు. గతంలో శ్రీనివాస్ రైతుగా నూతన సాగు విధానాలు పాటిస్తూ భూసారం కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించారు. దీంతో ఆయనకు ఈ పురస్కారం అందించారు. పలువురు అభినందించారు.

ఏడుగురితో హస్తం
తొలి జాబితా



తాటిపర్తి జీవన్‌రెడ్డి - జగిత్యాల
పుట్టినతేదీ : 05-01-1951
విద్యార్హతలు : బీఏ. ఎల్‌ఎల్‌బీ (ఉస్మానియా)
సామాజిక వర్గం: రెడ్డి
స్వగ్రామం: బతికపెల్లి, పెగడపల్లి మండలం, జగిత్యాల
అనుభవం: ఆరుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్సీ



రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ - రామగుండం
పుట్టినతేదీ : 15-08-1972
విద్యార్హతలు : బీఏ
సామాజిక వర్గం : బీసీ, బుందేలా
స్వగ్రామం : రామగుండం, గోదావరిఖని
అనుభవం : శాప్ చైర్మన్, 2014, 2108లో రామగుండం నుంచి ఎమ్మెల్యేగా పోటీ.



దుద్దిళ్ల శ్రీధర్‌బాబు - మంథని
పుట్టినతేదీ : 30 మే 1969
విద్యార్హతలు : ఎంఏ, ఎల్‌ఎల్‌బీ
సామాజిక వర్గం : బ్రాహ్మణ
స్వగ్రామం : ధన్వాడ, కాటారం మండలం
అనుభవం : మంత్రి, నాలుగుసార్లు ఎమ్మెల్యే



చింతకుంట విజయరమణారావు - పెద్దపల్లి
పుట్టినతేదీ : 08-11-1966
విద్యార్హతలు : ఇంటర్
సామాజిక వర్గం : వెలమ
స్వగ్రామం : శివపల్లి, ఎలిగేడు
అనుభవం: 2001లో జెడ్పీటీసీ,2009లో ఎమ్మెల్యే

ఆది శ్రీనివాస్ - వేములవాడ
పుట్టినతేదీ : 15-09-1966
విద్యార్హతలు : ఐటీఐ
సామాజికవర్గం : బీసీ, మున్నూరు కాపు
స్వగ్రామం : రుద్రంగి
అనుభవం : 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో పోటీ,
ప్రస్తుతం : టీపీసీసీ కార్యదర్శి,వేములవాడ ఇన్‌ఛార్జి



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ - ధర్మపురి
పుట్టినతేదీ : 01-04-1968
విద్యార్హతలు : ఇంటర్, ఐటీఐ
సామాజిక వర్గం : ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం : గోదావరిఖని
అనుభవం : జెడ్పీ చైర్మన్, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, 2014, 2018లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ..

కవ్వంపల్లి సత్యనారాయణ - మానకొండూర్
పుట్టినతేదీ : 10-06-1967
విద్యార్హతలు : ఎంబీబీఎస్ జనరల్ సర్జన్
సామాజికవర్గం : ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం : కరీంనగర్
అనుభవం : 2009లో, 2014లో ఎమ్మెల్యేగా పోటీ

- పెద్దపల్లిలోని మూడు నియోజకవర్గాలకూ అభ్యర్థుల వెల్లడి
- ఉమ్మడి జిల్లాలో మరో ఆరు స్థానాలకు త్వరలో ప్రకటన
- ఆరు పథకాలే ఆయుధాలంటున్న కాంగ్రెస్ నేతలు
- 19న పెద్దపల్లి, కరీంనగర్‌లో రాహుల్ పర్యటన
- ఎన్టీపీసీ, సింగరేణి కార్మికులు, ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులతో సమావేశం
- రాహుల్ యాత్రతో కొత్త జోష్ వస్తుందంటున్న నేతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ తొలిజాబితా విడుదలైంది. ఏడుగురు అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. మిగిలిన ఆరుస్థానాలకు త్వరలోనే రెండోజాబితాలో అభ్యర్థులను ప్రకటించనుంది. వాస్తవానికి ×కారు¤ పార్టీతో పోల్చితే ×హస్తం¤ పార్టీ అభ్యర్థుల ఎంపికలో జాప్యం చేసింది. ఇవేమీ ఎన్నికలపై ప్రభావం చూపబోవని, ఆలస్యంగా వచ్చినా సరే తాము ప్రచార కదనరంగంలో కొదమసింహాల్లా దూకుతామని కాంగ్రెస్ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. తొలిజాబితా అనుకూల పవనాలు ఉన్నచోట అధికార బీఆర్‌ఎస్‌ను ధీటుగా ఎదుర్కోగలిగిన అభ్యర్థులు ఉన్న స్థానాలు కావడం గమనార్హం.

ఈ స్థానాలకు అభ్యర్థులు..

ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి జిల్లాపైనే కాంగ్రెస్ పార్టీ బాగా ఆశలు పెట్టుకుంది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో మంథనిలో ఒకేచోట తమ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండటం.. ఇక్కడే పార్టీకి పట్టు ఉండటంతో ముందుగా ఆ జిల్లాలోని మూడుస్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆ తరువాత జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, జగిత్యాలకు అభ్యర్థులను ప్రకటించిన హస్తం పార్టీ.. కోరుట్లను తరువాత జాబితాకు మార్చింది. రాజన్నసిరిసిల్లజిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో వేములవాడకు అభ్యర్థిని ప్రకటించి.. సిరిసిల్లకు ఆపింది. కీలకమైన కరీంనగర్‌లో ఒక్క మానకొండూరుకు అభ్యర్థిని ప్రకటించి.. మిగిలిన చొప్పదండి, హుజూరాబాద్, హుస్నాబాద్, కరీంనగర్ స్థానాల ప్రకటన వాయిదా వేసింది. ప్రస్తుత జాబితాలోని అభ్యర్థుల్లో ముగ్గురు ఓసీ (వెలమ, బ్రాహ్మణ, రెడ్డి) సామాజికవర్గాలకు చెందిన వారు కాగా.. ఇద్దరు బీసీ (బుందేల, మున్నూరు కాపు), మరో ఇద్దరు ఎస్సీ (మాదిగ) సామాజికవర్గాలకు చెందిన వారు.

ఆరుపథకాలపై విశ్వాసం

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలు తమను అధికారంలోకి తీసుకొస్తాయని హస్తం పార్టీ నేతలు బలంగా నమ్ముతున్నారు.

- మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రతి మహిళకూ నెలకు రూ.2,500 ఆర్థిక సాయం.
- రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.
- రైతు భరోసా కింద ఏటా రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15,000 పెట్టుబడి సాయం, వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఆర్థిక సాయం.
- వరి పంటకు అదనంగా రూ.500 బోనస్.
- గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు కరెంట్ ఉచితం.
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం.
- యువ వికాసం కింద విద్యా భరోసా కార్డు ద్వారా విద్యార్థులకు రూ.5 లక్షల పరిమితితో వడ్డీరహిత ఆర్థిక సాయం, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటు.
- చేయూత కింద పింఛనుదారులకు నెలకు రూ.4,000 పింఛను, ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల బీమా.

19న పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో రాహుల్ పర్యటన

ఈనెల 19న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సింగరేణి, ఎన్టీపీసీ ఉద్యోగులు, యూనియన్ లీడర్లు, ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగాల బాధితులతో సమావేశం అవుతారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పెద్దపల్లిలో బహిరంగసభలో మాట్లాడతారు. రైస్‌మిల్లర్ల అసోసియేషన్, రైతులతో సమావేశమవుతారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పెద్దపల్లి నుంచి కరీంనగర్ వరకు పాదయాత్ర ద్వారా చేరుకుంటారు. రాహుల్ పాదయాత్ర ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని సీనియర్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

సాక్షి, పెద్దపల్లి: తమ ఆకాంక్షలు నేరవేరస్తుందనే నమ్మకంతో ప్రజలు బీఆర్‌ఎస్‌కు అధికారం ఇచ్చారు. తొమ్మిదేళ్లలో వారిఆశలను ఈ ప్రభుత్వం నెరవేర్చడంలో విఫలమైంది. ఈరోజు ఆ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు విశ్వసించడం లేదు. 57ఏళ్లకే పింఛన్, నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాలు, డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు మంజూరు చేస్తామని గతంలోనే ఆ పార్టీ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారు. రాష్ట్రం, మంథనిలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే.

– దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంథని ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్‌కు చరమగీతమే

సాక్షి, పెద్దపల్లి: బీఆర్‌ఎస్ పాలన, స్థానిక ఎమ్మెల్యే పనితీరుపై విసుగుచెందిన ప్రజలు.. కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులవుతున్నారు. మా పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకుపోయాం. వాటికి ప్రజల నుంచి మంచిస్పందన వస్తోంది. ఈసారి బీఆర్‌ఎస్ అభ్యర్థులకు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న నాకు ప్రజలు విజయం చేకూరుస్తారనే విశ్వాసంతో ఉన్నా. ప్రజలే నా దేవుళ్లు. వారి ఆశీస్సులు నాకే ఉన్నాయి.

–విజయరమణరావు, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి

కార్యకర్తకు దక్కిన గౌరవం

బీసీ బిడ్డ, సామాన్య కార్యకర్తనైన నాకు కాంగ్రెస్ నుంచి టికెట్ లభించడం చాలాసంతోషంగా ఉంది. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఉద్యోగాల పేరిట చేసిన మోసం చేసి, ఎన్టీపీసీ బూడిద తరలింపులో అక్రమాలకుపాల్పడి, యువతకు ఉద్యోగాల కల్పనలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తా.

– రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి

తొలిరోజు ఐదుగురికి బీ-ఫామ్స్

- సీఎం చేతులమీదుగా తీసుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- హైదరాబాద్‌లో అందుకున్న మంత్రి కేటీఆర్
- హుస్నాబాద్ బహిరంగ సభలోనే సతీష్‌బాబుకు..
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయికి, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరికి బీ-ఫామ్



పెద్దపల్లిరూరల్: బీ-ఫామ్ అందుకుంటున్న దాసరి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను తొలిరోజు (ఆదివారం) నలుగురు అభ్యర్థులకు పార్టీ బీ-ఫామ్‌లను సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో అందించారు. హైదరాబాద్‌లో అందుకున్నవారిలో రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్.. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌బాబుకు సభావేదికపైనే బీ-ఫామ్ అందించారు. దీంతో బీ-ఫామ్ అందుకున్నవారి సంఖ్య ఐదుకు చేరింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మిగితా అభ్యర్థులకు సోమవారం తెలంగాణభవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీ-ఫామ్స్ అందించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించారు.

భక్తులకు సకలసౌకర్యాలు



ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి భక్తులకు సకలసౌకర్యాలు కల్పిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ అన్నారు. దేవస్థానంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు వసతి కల్పించేందుకు సత్రాలు నిర్మిస్తామని, రూ.40లక్షల వ్యయంతో సులభ్‌కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పారు. మదనపోచమ్మ గుడితోపాటు చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అన్యాకాంత్రమైన దేవస్థానం భూమిని స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి ఓదెల దేవస్థానం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి తెస్తామన్నారు. ఆలయ కమిటీ వైస్ చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు, డైరెక్టర్లు ఆరెల్లి మొండయ్యగౌడ్, శ్రీకాంత్, కర్రె కుమారస్వామి, గంప కిశోర్, ఈవో సదయ్య పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి

- పండుగ సామగ్రి తెచ్చుకునేదెలా?
- లాభాల వాటా, దసరా అడ్వాన్స్ చెల్లింపులపై ఎన్నికల కోడ్
- ఎప్పటిలాగే చెల్లించాలంటున్న కార్మిక సంఘాల నాయకులు
- ఎలక్షన్ కమిషన్‌తో సంప్రదిస్తున్నామంటున్న యాజమాన్యం



గోదావరిఖని: బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల కోసం అవసరమైన దుస్తులు, ఆహార పదార్థాలు, ఇంటి సామగ్రి తదితరాలు కొనుగోలు చేస్తామనే సింగరేణి కార్మికుల ఆశలు ఆవిరి అయ్యాయి. లాభాల బోనస్, దీపావళి అడ్వాన్స్ చెల్లింపులపై ఎన్నికల కోడ్ ప్రభావం ఇందుకు కారణమైంది. కొత్తబట్టలు, బంధువుల రాక, అనేక ఆశల మధ్య దసరా పండుగ ఘనంగా జరుపుకోవాలని కార్మికులు ఆశపడ్డారు. కానీ, ఎన్నికల కోడ్ అడ్డుగా రావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

నేడు చెల్లించాల్సి ఉంది..

- వాస్తవానికి కార్మికులకు లాభాల వాటాను సోమవారం చెల్లించాల్సి ఉంది.
- ఈనెల 20న రూ.25వేల దసరా అడ్వాన్స్ వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయాల్సి ఉంది.
- లాభాల వాటాపై ఈనెల 4న సీఎం కేసీఆర్ ప్రకటన చేశారు.
- తద్వారా ఈసారి యాజమాన్యం సాధించిన వాస్తవ లాభాల్లోంచి 32శాతం కార్మికుల వాటాగా రూ.711కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమచేయాల్సి ఉంది.
- కానీ, అనూహ్యంగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది.
- తద్వారా నిబంధనలు అతిక్రమించే వారిపై ఎన్నికల కమిషన్ కొరడాఝుళిపిస్తోంది.
- ఈక్రమంలో లాభాల వాటా, దసరా అడ్వాన్స్ చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఎన్నికల కమిషన్‌ను విన్నవించేందుకు సింగరేణి యాజమాన్యం యత్నిస్తోంది.
- ఇప్పటికే సంస్థ ఉన్నతాధికారులు ఎన్నికల కమిషన్‌ను సంప్రదించారు.

ఏటా చేయాల్సిన చెల్లింపులే..

సింగరేణి సాధించే లాభాల్లోంచి వాటా, దీపావళి బోనస్, దసరా అడ్వాన్స్‌ను ఏటా కార్మికులకు చెల్లిస్తూ వస్తోంది. సంస్థ వ్యాప్తంగా ఉన్న 42వేల మంది కార్మికులకు ఈసొమ్మును యాజమాన్యం అందిస్తోంది. ప్రధానంగా పండుగ కావడంతో కొత్తవస్త్రాలు, గృహోపకరణాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు ఉద్యోగులు ఈ సొమ్ము వెచ్చిస్తున్నారు. కొందరు తమ పిల్లల స్కూల్, కాలేజీ ఫీజు చెల్లిస్తూ వస్తున్నారు. ఈసారి చెల్లింపులపై ఎన్నికల కోడ్ ప్రభావం ఉండడంతో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు.

వాటా చెల్లించాల్సిందే



సింగరేణి కార్మికుల లాభాల వాటా చెల్లింపు ఈనెల 4వ తేదీనే ప్రకటించారు. ఎన్నికల కోడ్ ఈనెల 9న అమలులోకి వచ్చింది. లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ ఏటా చెల్లించేవే. వీటిని ఎన్నికల కోడ్‌తో ముడిపెట్టడం సరికాదు.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

ముడిపెట్టవద్దు



ఎన్నికల కోడ్‌తో లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ చెల్లింపులను ముడిపెట్టడం సరికాదు. వెంటనే వాటా, అడ్వాన్స్ చెల్లించాలి. పండుగ రావడంతో అందరూ ఈ సొమ్ము కోసమే ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

– తుమ్మల రాజారెడ్డి, అధ్యక్షుడు, సీఐటీయూ

పండుగపూట పస్తులా?



పండుగపూట కార్మికులు పస్తులు ఉండేలా యాజమాన్యం వ్యవహరించడం సరికాదు. బొగ్గు పొరల్లోకి వెళ్లి బొగ్గు వెలికితీస్తూ దేశానికి వెలుగులు అందిస్తున్న కార్మికులకు లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ చెల్లించాల్సిందే.

– యాదగిరి సత్తయ్య, అధ్యక్షుడు, బీఎంఎస్

చెల్లించేలా చూస్తాం



లాభాల వాటా, దసరా పండుగ అడ్వాన్స్ ఏటా చెల్లించేవే. అయినా, ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అందుకే అనుమతి కోసం ఎన్నికల కమిషన్‌ను సంప్రదిస్తున్నాం. కార్మికులకు సకాలంలో అన్ని చెల్లింపులు చేస్తాం.

– ఎస్.బలరాం, డైరెక్టర్(పా), సింగరేణి

మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మైండ్‌బ్లాక్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మైండ్‌బ్లాక్ అయ్యిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ భవితకు భరోసాగా సబ్బండ వర్గాలకు లబ్ధి చేకూరేలా మేనిఫెస్టో రూపొందించారని చందర్ ప్రశంసించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రజాహిత మేనిఫెస్టో రూపొందించారని అన్నారు. రైతుబంధు ఎకరాకు ఏటా రూ.16వేలు, తెల్లరేషన్ కార్డుదారులకు కేసీఆర్ బీమా, ప్రతీఇంటికి ధీమా, కుటుంబానికి రూ.4వేలు చెల్లించి రూ.ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పన దేశానికే ఆదర్శప్రాయమన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకుడు కౌశిక హరి ఉన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే టికెట్

- బీఆర్‌ఎస్ దొంగహామీలను నమ్మొద్దు
- రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్



పాదయాత్రలో చిన్నారితో మక్కాన్‌సింగ్

జ్యోతినగర్(రామగుండం): రామగుండం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే తనకు కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ వచ్చిందని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. 9వ రోజు ప్రజాదీవెన యాత్ర సందర్భంగా ఆదివారం స్థానిక ప్రశాంతినగర్ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 5, 2, 23, 4వ డివిజన్లలో పాదయాత్ర కొనసాగించారు. వచ్చే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్‌తోనే ప్రతీపేద కుటుంబానికి న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ఇచ్చే దొంగ హామీలను నమ్మవద్దని కోరారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక, పరీక్షలు సరిగా నిర్వహించలేక యువకులు నిరుద్యోగులుగా మారి ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. ప్రశ్నించే గొంతుతో తనను అసెంబ్లీకి పంపిస్తే రామగుండం ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ఎన్టీపీసీ రామగుండం పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో డీసీసీ కార్యదర్శి ఎండీ రహీం, నాయకులు లక్ష్మణ్, ఈదునూరి మల్లేశ్, మడిపల్లి మల్లేశ్, కిరణ్, లింగమూర్తి, అనిల్, ముచ్చకుర్తి రమేశ్, ప్రకాశ్, మణి, సురేందర్ రెడ్డి, సరిత, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట



మిఠాయిలు తినిపిస్తున్న మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్‌ఎస్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. పార్టీ మేనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పు రాజ్‌కుమార్‌తోపాటు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాముని సేవలో ప్రధాన న్యాయమూర్తులు


పూజలు చేస్తున్న మూడు జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీసీతారామస్వామి వారిని రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ప్రేమలత, ప్రతిమ, హేమంత్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో నిత్యం వెలిగే నంద దీపం, మూల విగ్రహాలను సందర్శించారు. ఆలయ విశిష్టత గురించి ఆలయ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సాగౌడ్ వివరించారు. అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం జయంతి


నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి రాజయ్య కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు కల్వల రాజేశం, అంజయ్య, సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

యువతకు అవకాశం ఇవ్వాలి


వినతిపత్రం అందిస్తున్న దేవేందర్

పెద్దపల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లో పోటీచేసేందుకు యువతకు అవకాశాలు కల్పించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ కోరారు. ఈమేరకు మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావును ఆదివారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశాన్ని తనకు కల్పించేలా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు దేవేందర్ తెలిపారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ సయ్యద్ ఫయాజ్ తదితరులు ఉన్నారు.

నగదు పట్టివేత

రామగిరి: ఎస్సై రవి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సెంటనరీకాలనీలో వాహనాల తనిఖీ చేశారు. మంథని మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రూ.60,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. తగిన ఆధారాలు చూపించకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా నగదు తరలించవద్దన్నారు.

విలీనమా.. ఎన్నికల నిర్వహణా?

- ఇంకా ప్రత్యేకాధికారుల పాలనలోనే పంచాయతీలు
- ఎన్నికలకు దూరంగా లింగాపూర్, కుందనపల్లి, వెంకట్రావుపల్లి
- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు


కుందనపల్లి గ్రామ పంచాయతీ

రామగుండం: అంతర్గాం మండలం లింగాపూర్, కుందనపల్లి, రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీలు ఇప్పటికీ ప్రత్యేకాధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. ప్రత్యేకాధికారుల పదవీకాలం 2024 ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగుస్తుంది. ఆలోగా ఎన్నికలు నిర్వహిస్తారా? లేక రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేస్తారా? అనే అనుమానాలు గ్రామస్తుల్లో వ్యక్తం అవుతున్నాయి.

మూడు పంచాయతీల్లో ప్రత్యేక పాలన..

- జిల్లాలో మొత్తం 266 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.
- అయితే, అంతర్గాం మండలం కుందనపల్లి, లింగాపూర్, రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామపంచాయతీలు, పాలకుర్తి మండలం ఎల్కలపల్లి పంచాయతీలోని 2వార్డులను రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేశారు.
- మిగిలిన గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు నిర్వహించారు.
- అయితే, కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో తమ గ్రామాలకు ఉపాధిహామీ పథకం వర్తించడం లేదని, తద్వారా తాము ఉపాధి కోల్పోతామని గ్రామస్తులు ఆందోళనలు తీవ్రతరం చేశారు.
- దీంతో విలీన నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.
- ఆ తర్వాత 2020 జనవరిలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి.
- అప్పుడు ఈ మూడు గ్రామాలు, వార్డుస్థానాలకు ఎన్నికలు నిర్వహించలేదు.
- అప్పట్నుంచి ఇవి గ్రామ పంచాయతీలుగానే కొనసాగనున్నాయి.
- కానీ, ఆ తర్వాత ఈ గ్రామాలు, వార్డుస్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించలేదు.
- సదరు గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. ఇప్పటికీ అవి ప్రత్యేక పాలనలోనే కొనసాగుతున్నాయి.

ఏడాదిగా ఖాళీలు..

జిల్లాలోని 12 మండలాల్లో గల 76 గ్రామ పంచాయతీల్లో 173 వార్డుస్థానాలు వివిధ కారణాలతో ఖాళీ అయ్యాయి. వీటితోపాటు కుందనపల్లి, లింగాపూర్, వెంకట్రావుపల్లి పంచాయతీల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని గత మార్చిలో ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో 2023 ఏప్రిల్ 21 నాటికి ఓటరు జాబితా సిద్ధంచేయాలని, మే, జూన్‌లో ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. కానీ, సకాలంలో ఎన్నికలు పూర్తిచేయలేకపోయింది.

ఏర్పాట్లలో ఆశావాహులు..

కుందనపల్లి, లింగాపూర్‌తోపాటు వెంకట్రావుపల్లిలో అప్పుడే ఎన్నికల సందడి నెలకొంది. ఆశావాహులు ఎలాగైనా పదవులు దక్కించుకునేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసుకుంటున్నారు. గ్రామస్థాయి వేడుకలు, వివిధ అభివృద్ధి, పెండింగ్ పనులు పూర్తిచేయడంపై అధికారులను ప్రశ్నిస్తూ ప్రజలతో మమేకం కావాలని తహతహలాడుతున్నారు.

గడువులోగా ఎన్నికలు



కుందనపల్లి, లింగాపూర్ ఇప్పటికీ గ్రామ పంచాయతీలుగానే కొనసాగుతున్నాయి. కానీ, ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. 2024 ఫిబ్రవరి ఒకటో తేదీనాటికి ప్రత్యేకాధికారుల పదవీకాలం ముగుస్తుంది. ఆలోగా రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తుంది. వాటితోపాటే కుందనపల్లి, లింగాపూర్ పంచాయతీలకూ ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మేం వ్యవహరిస్తాం.

– బూక్యా యాదగిరి, ఎంపీడీవో, అంతర్గాం

గంజాయి రహిత గ్రామాలే లక్ష్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న విమలక్క తదితరులు

- పోరాటాలతోనే అది సాధ్యం
- ప్రజాగాయకురాలు విమలక్క

రామగిరి(మంథని): గంజాయి రహిత గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా పోరాటాలు చేస్తామని ప్రజాగాయకురాలు విమలక్క అన్నారు. ప్రస్తుతం పల్లెలు, పట్టణాల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. మద్యపాన నిషేధం, గంజాయి నియంత్రణకు సమష్టి పోరాటాలే శరణ్యమని అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటనరీకాలనీలో ఆదివారం రాత్రి జరిగిన బహుజన బతుకమ్మ సంబురాల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మహిళలతో బతుకమ్మ ఆడారు. అనంతరం విమలక్క మాట్లాడారు. బహుజన బతుకమ్మ ఉత్సవం కాదని, ఒక ఉద్యమంలా మహిళందరూ ముందుకు సాగాలని కోరారు. ఈ ఏడాది ×మద్యం రద్దు– మగువల రక్షణ× నినాదంతో మహిళలను చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఏ పార్టీకి తాము మద్దతు ఇవ్వబోమని, మద్యపానం, గంజాయి, మహిళలపై అఘాయిత్యాలు నియంత్రణించిన పార్టీకే మద్దతు పలకాలని మహిళలను కోరారు. మహిళలపై దాడులు ఆగడంలేదని, వారు గౌరవంగా ముందుకు సాగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులం, మతం పేరిట మహిళలపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గద్దర్‌కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో భూపాల్‌పల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, జెడ్పీటీసీ మ్యాదరబొయిన శారద, వైస్ ఎంపీపీ కాపురబొయిన శ్రీదేవి, సర్పంచులు అల్లం తిరుపతి, పల్లె ప్రతిమ, కళాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగం ముసుగులో కాంట్రాక్టులు

- విద్యుత్ సంస్థలో యథేచ్ఛగా వ్యవహారం
- 'మామూలు'గా తీసుకుంటున్న ఉన్నతాధికారులు
- ఆపరేటర్ బదిలీతో వెలుగుచూస్తున్న వైనం



కొత్తపల్లి(కరీంనగర్): ఉద్యోగం ముసుగులో కాంట్రాక్టు పనులు చేపడుతూ రెండు చేతులా సంపాదిస్తున్న వ్యవహారం విద్యుత్ సంస్థలో యథేచ్ఛగా కొనసాగుతోంది. విద్యుత్ సంస్థ నిబంధనలు తుంగలో తొక్కుతూ బంధువుల అవతారంలో ఉద్యోగులే కాంట్రాక్టు పనులు చేపడుతున్నప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం 'మామూలు'గా తీసుకుంటూ పనికాజేస్తున్నారు. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని చెర్లభూత్కూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ శ్యాం నిర్లక్ష్య ధోరణితో కాంట్రాక్ట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శ్యాం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు అతనిపై బదిలీ వేటు వేయడం విద్యుత్ సంస్థలో చర్చకు దారితీసింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఆపరేటర్‌పై సస్పెన్షన్ వేటు వేయాల్సిన అధికారులు బదిలీ చేయడంపై అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉంటే ఓ పక్క ఉద్యోగం చేస్తూనే మరోపక్క కాంట్రాక్టర్ అవతారమెత్తినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు అతనిపై లోతుగా విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. విద్యుత్ సంస్థలోని అనేక మంది కాంట్రాక్టర్ల అవతారమెత్తుతున్నప్పటికీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. విద్యుత్ సంస్థ నియమ నిబంధనల ప్రకారం అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు కాంట్రాక్టర్లుగా వ్యవహరించకూడదు. కాని వీటన్నింటిని పట్టించుకోకుండా రెండు చేతులా సంపాదిస్తున్న ఉద్యోగులపై ఉన్నతాధికారులు మమకారం చూపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెర్లభూత్కూర్ ఆపరేటర్ శ్యాం ఓ పక్క సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే మరోపక్క ఆయన భార్య పేరిట లైసెన్స్ తీసుకొని కాంట్రాక్టు పనులు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇతని సోదరుడి పేరుతో సైతం లైసెన్స్ తీసుకొని విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు పనులు చేస్తున్నట్లు తీవ్ర చర్చ జరుగుతోంది. అదేవిధంగా అతని తండ్రి సైతం పెద్దపల్లి సర్కిల్ పరిధిలోని సుల్తానాబాద్‌లో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులు వ్యవహరిస్తున్నా అధికారులు నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగం చాటున కాంట్రాక్టు పనులు చేపట్టే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని మాందాడపల్లి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలానికి చెందిన తాడిచర్ల సాయితేజ, మార్క అజయ్(35) సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై హుజూరాబాద్ వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గంమధ్యలో కరీంగనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై మాందాడిపల్లి శివారులో గుర్తు తెలియని వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటన ఇద్దరు గాయపడ్డారు. 108లో స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మార్క అజయ్ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. సాయి తేజ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ బోల్తా

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు శివారులో కొబ్బరి బోండాల లోడ్ వ్యాన్ ఆదివారం వేకువజామున బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ భీమయ్యకు స్వల్ప గాయాలు అయ్యాయి. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, వివరాలు సేకరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ శివారులో పేకాట ఆడుతున్న 11మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు. వీరి నుంచి రూ.50,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో తుమ్మనపల్లికి చెందిన ఇద్దరు, సింగాపూర్‌కు చెందిన 8మంది, హుజూరాబాద్‌కు చెందిన వారు ఒకరు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా


మాట్లాడుతున్న రాజు, అనుచరులు

ఎలిగేడు(పెద్దపల్లి): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తమకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటయ్యాక కనీస విలువలు లేకుండా పోయాయని, దీంతో మనస్తాపం చెంది బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు బింగి రాజు తెలిపారు. ఆదివారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, మిలియన్‌మార్చ్‌తోపాటు వంటావార్పు వంటి పోరాటాల్లో తమవంతు పాత్ర పోషించామని అన్నారు. ప్రస్తుతం ఉద్యమకారులకు బీఆర్‌ఎస్ పార్టీలో గుర్తింపులేదని, అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నామని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో తన అనుచరులతో కలిసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి రాజు అనుచరులు కోట సమ్మయ్య, తీట్ల శ్రీనివాస్, మారం మల్లేశం, తీట్ల మల్లేశం, కుదుదుల నరేశ్, రాకేశ్, ముంజంపల్లి లచ్చయ్యలతోపాటు మరో 40మంది ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మంథని ఎంపీపీ

మంథని: బీఆర్‌ఎస్‌కు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు ఆదివారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. మంథని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీ కొండ శంకర్, వైస్ ఎంపీపీ స్వరూప్‌రెడ్డి, ఎక్లాస్‌పూర్, ఉప్పట్ల, చిల్లపల్లి ఎంపీటీసీ సభ్యులు పెండ్లి చైతన్య– ప్రభాకర్, దేవక్క–లింగయ్య, సత్యవతి– రాజయ్యతోపాటు పోతారం సర్పంచ్ స్వప్న– సదానందం, నలుగురు వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. వీరికి హైదరాబాద్ గాంధీభవన్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కండువాలు కప్పి ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


ప్రమాదానికి గురైన వాహనం

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్– వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మానకొండూరు మండలం గంగిపల్లి సర్పంచ్ భర్త సాగర్ తన కారులో కరీంనగర్ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో సాగర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

హైదరాబాద్‌లో జగిత్యాల యువకుడి ఆత్మహత్య




జగిత్యాలక్రైం: మహాలక్ష్మీనగర్‌కు చెందిన దొనకంటి సాయిరాం (30) హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన సాయిరాం జగిత్యాలలోని మహాలక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్లాడు. హిమాయత్‌నగర్‌లోని వెలమ హాస్టల్‌లో శనివారం క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు అతడిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.

అనారోగ్యంతో తండ్రి మృతి


అనాథలైన ఇద్దరు చిన్నారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంటాడుతున్న పేదరికం బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తల్లి.. అనారోగ్యంతో తనువు చాలించిన తండ్రి వెరసి నేడు ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇంతకాలం భర్త కూలీనాలీ చేసి ఆ కుటుంబాన్ని పోషించాడు. గతేడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబ పెద్ద ఆదివారం మృతిచెందాడు. దీంతో భార్య, ఇద్దరు కూతుళ్లు రోడ్డున పడ్డారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన మాచర్ల స్వామి–సుజాత దంపతులకు అశ్విత, అనిన్య కూతుళ్లు. భార్య బీడీలు చుడుతుండగా, స్వామి కూలీ పనులు చేసేవాడు. ఈక్రమంలో స్వామి ఏడాది క్రితం అనారోగ్యం బారిన పడ్డాడు. ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. ఖరీదైన వైద్యం అందక రెండు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఇంటి వద్దనే ఉన్న స్వామి మరణించాడు. అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్తులు చందాలు పోగుచేసి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. స్వామి మరణంతో భార్య, ఇద్దరు కూతుళ్లు అనాథలుగా దిక్కులు చూస్తున్నారు. దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తన భర్త మృతితో దిక్కులేని వాళ్లమయ్యామని సాయం అందించి ఆదుకోవాలని సుజాత కోరుతుంది. సాయం అందించే వారు ఫోన్‌పే 63018 38702 మాచర్ల సతీశ్‌కు ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటుంది.


మాచర్ల స్వామి(ఫైల్)

మానేరులో ఇసుక తవ్వకాల జోరు


మానేరులో ఇసుక ట్రాక్టర్లు


రాత్రివేళలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు

- ప్రభుత్వ కార్యాలయం నుంచే తరలింపు

ముత్తారం: ఎన్నికల వేళ.. చోటామోటా నాయకుల పైరవీలు.. స్యాండ్ ట్యాక్స్ నిలిపివేతలు.. తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత చందంగా తయారైంది మానేరులో ఇసుక తవ్వకాల జోరు. ముత్తారం, ఖమ్మంపల్లి స్యాండ్‌ట్యాక్స్, ఇసుక రీచ్‌లు నిలిచాపోయాయి. దీంతో ట్రాక్టర్ యాజమానులు ఓ స్థానిక నాయకుడి సహకారంతో అధికారులతో కుదుర్చుకున్న ఒప్పందంతో రాత్రింబవళ్లు జోరుగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. ముత్తారం మండలం పారుపల్లి, ముత్తారం, ఓడెడ్, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి మానేరు నుంచి రోజుకు వందలాది ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నాయి. అయినా, అధికారులు పట్టించుకున్న దాఖాలు లేవు. మానేరు నుంచి మంథని, రామగిరి, కమాన్‌పూర్, గోదావరిఖని ప్రాంతాలకు ఇసుక అక్రమంగా తరలిపోతోంది. లోకాల్ అయితే ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.1,500 నుంచి రూ.2వేల వరకు, నాన్ లోకాల్‌కు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు.

నెలకు రూ.10వేల వరకు వసూలు..?

ఇసుక ట్రాక్టర్ యాజమానులు మధ్యవర్తి నాయకుడికి ఒక్కో ట్రాక్టరుకు నెలకు రూ.8వేల నుంచి రూ.10వేలు మామూలు ఇస్తున్నారని తెలుస్తోంది. దీంతోనే స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సమీపం నుంచే రేయింబవళ్లు దర్జాగా ఇసుక అక్రమంగా తరలిపోతోందనే ఆరోపణలు ఉన్నాయి. ముత్తారం నుంచి సుమారు 70 ట్రాక్టర్లు, పారుపల్లి నుంచి 50, ఓడెడ్‌లో 40, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి నుంచి 100 ట్రాక్టర్లపైగా మానేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నాయని సమాచారం. ముత్తారం, పారుపల్లి, ఓడెడ్ మానేరువాగు నుంచి నడిచే ట్రాక్టర్ల నుంచి నెలకు సుమారు రూ.ఐదారు లక్షలు వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. నిబంధనల ప్రకారం రీచ్‌ల వద్ద ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే రూ.2,500 వరకు ధర ఉంటోంది. అక్రమార్కులు దొడ్డిదారిన నిర్ణీత దూరాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును ఆపితే.. కాసేపటికే పెద్దల నుంచి అధికారులకు ఫోన్‌లు వస్తుండటంతో వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో దందా జోరుగా సాగుతోందని అంటున్నారు.

చర్యలు తప్పవు

ముత్తారం మండలం మానేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలించే ట్రాక్టర్లు పట్టుబడితే చర్యలు తప్పవు. పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానా విధిస్తాం. వాహనాలు సీజ్ చేస్తాం. ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్లను పోలీసుల సహకారంతో పట్టుకుంటాం. ట్రాక్టర్ యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. ఇలాంటి సమాచారం తెలిస్తే మా దృష్టికి తీసుకు రావాలి. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– బండి రాజేశ్వరి, తహసీల్దార్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DIRECT FINAL YEAR
Discontinued (OR) Fail: Direct Final Year LLB, B.Tech, M.Tech, MBA, GNM, B.Sc, M.Sc అగ్రి/ నర్సింగ్, Ph.D(All). Cont: 7013038197, 8885404396. [W-189190]

REAL ESTATE
PLOT FOR SALE
కరీంనగర్‌కు 13 కి.మీ దూరంలోని కొత్తపల్లి (H) దగ్గర 2గుంటల ప్లాటు కేవలం రూ॥ 10,00,000/- (10లక్షలు) అమ్మబడును. సెల్: 9160892729 [K-1185725]

SERVICES
LOANS
సిరి అసోసియేట్స్: హౌస్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-1220901]

WANTED
సెక్యూరిటీగార్డ్స్ కావలెను. 8hrs డ్యూటీ, వీక్లీ ఆఫ్, PF+ESI సౌకర్యం కలదు. మంచి జీతం బోనస్. కరీంనగర్. Ph: 7013730900/ 9246543129 [H-793466]

ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [H-189343]

ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: 10th/ ఇంటర్. జీతం: 14,000 +PF+ESI+TA + DA. @ మిడ్‌వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్, AP, TS. సంప్ర: Ph: 8121006637 [HA-722]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824